మురుగు సమస్యను పరిష్కరిస్తాం


కూకట్‌పల్లి బస్టాపును పరిశీలిస్తున్న అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి బస్టాపులో నెలకొన్న మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హైడ్రా ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, జీహెచ్ఎంసీ డీఈఈ శంకర్, ఏఈఈ వర్షిణి, ఏఈ రంజిత్‌లు అన్నారు. మంగళవారం 'బస్సులు ఆగేదెట్లా' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కాగా, కూకట్‌పల్లి బస్టాపును ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్ఓ మత్తుయాదవ్ సూచనల మేరకు సందర్శించారు.

ఎమ్మెల్యేకు వినతి



మూసాపేట్ నుంచి కైత్లాపూర్ (గ్రీన్‌హిల్స్) రోడ్డులో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారావుకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. రెయిన్ బో విస్టాస్ రాక్ గార్డెన్, మెరీనా స్కై, రెయిన్‌బో విస్టా ఫేజ్-1 సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. - కేపీహెచ్‌బీకాలనీ,(ఆంధ్రజ్యోతి)

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- **కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, శిరీష**

బాలానగర్/ కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, పగడాల శిరీషలు అధికారులకు సూచించారు. మంగళవారం బాలానగర్ డివిజన్‌లోని రాజూకాలనీ జెండా గల్లీ, బాలాజీనగర్ డివిజన్‌లోని వివేక్‌నగర్, కైత్లాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వేర్వేరుగా వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాజా, చంద్రపాల్, మల్లారెడ్డి, శ్రీనివాస్, అనిల్, మహిళా నాయకులు సుజాత, కవిత, మధులత, సావిత్రి, లలిత తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన

అల్లాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్ నగర్ ఈ-బ్లాక్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ సబీహ బేగం మంగళవారం పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట సఫ్దర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హమీద్, షేక్ సుబాన్, రాము, నర్సింహ ఉన్నారు.


జీహెచ్ఎంసీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కార్మికులకు దుస్తులు అందజేత

అల్లాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్ మోతీనగర్‌కు చెందిన దుట్ట రవీంద్రనాథ్ ఠాగూర్ తన నాయనమ్మ జ్ఞాపకార్థం మంగళవారం జీహెచ్ఎంసీ కార్మికులకు తులసీనగర్‌లో దుస్తులను పంపిణీ చేశారు. 'దుట్ట రాఘవమ్మ ఇంటిగ్రేటెట్ వాలంటరీ ఎవల్యూషన్' డ్రైవ్‌ను నెలకొల్పామని, సందర్భానుసారంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి ప్రతినిధలు భైరెడ్డి, ఉమామాహేశ్, శ్రీలత, నాగరాజు, నాని పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- **తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

కూకట్‌పల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ కూకట్‌పల్లి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతరావుతో కలిసి వారు మాట్లాడారు. నిజాం పాలనలో ఖాసీంరజ్వీ చేసిన దాడులకు ఎంతో మంది మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి 1947లోనే స్వాతంత్ర్యం వచ్చినా.. తెలంగాణకు మాత్రం స్వాతంత్ర్యం రాలేదన్నారు. భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల సెప్టెంబరు 17న నిజాం, రజాకార్ల నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని వారు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవానికి సంబంధించిన రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విమోచన దినోత్సవాన్ని భావితరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయకోసమే గత పాలకులు విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించలేదన్నారు. 27 ఏళ్లుగా బీజేపీ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. మహారాష్ట్రలో విముక్తి దివస్‌గా నిర్వహిస్తారన్నారు. బీజేపీ ప్రభుత్వం 2023లో కేంద్రం అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించాలని గెజిట్ కూడా విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ నిర్ణయాన్ని ఇతర పాలకులు వక్రీకరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీకర్‌రావు, సురేందర్‌రెడ్డి, రమేశ్, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించాలి

కూకట్‌పల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం ఉంటుందని, ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాలని కార్పొరేటర్ సత్యనారాయణరావు అన్నారు. కూకట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులను గౌరవించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల పైనే ఆధార పడి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కార్పొరేటర్ విద్యార్థులకు సూచించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- **ఏబీవీపీ నాయకుల డిమాండ్**


కూకట్‌పల్లి బస్టాప్ వద్ద ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కూకట్‌పల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కూకట్‌పల్లిలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హైదరాబాద్ మహానగర సంయుక్త కార్యదర్శి భరత్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఎంతో మంది విద్యార్థులు చదువులకు దూరం కావాలసిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేసే వారు ఏబీవీపీ విద్యార్థులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కూకట్‌పల్లి కార్యదర్శి ధనంజయ్, గణేశ్, చరణ్, ఉదయ్, రాకేశ్, నరసింహ, వంశీ, నరేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మేధా స్కూల్ విద్యార్థులను ఆదుకోండి: సీపీఎం


మేధా స్కూల్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లిలోని మేధా స్కూల్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి నచ్చిన స్కూళ్లలో చేర్పించాలని సీపీఎం నేతలు విద్యాశాఖ అధికారులను కోరారు. మేధా స్కూల్‌లో అల్ప్రాజోలం తయారు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సీపీఎం బాలానగర్ మండల కమిటీ నాయకులు పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో చదువుతున్న 63 మంది విద్యార్థులను ఆదుకోవాలని, వారి విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలని సంబంధిత అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు. అధికారులు తనిఖీ చేయకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్ స్కూళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓల్డుబోయినపల్లిలోని స్కూల్‌లో మత్తు పదార్థ తయారీ కేంద్రం వెలుగులోకి వచ్చినప్పటికీ స్థానిక కార్పొరేటర్ స్పందించక పోవడంలో ఆంతర్యమేంటని సీపీఎం నేతలు అనుమానం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్, మేడ్చల్ జిల్లా నాయకులు శంకర్, మండల కమిటీ సభ్యులు వెంకటనర్సయ్య, శ్రీధర్, జగన్, రాము, ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'యాత్రదానం' పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయుల కోసం టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రారంభించిన యాత్రదానం పోస్టరును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆర్టీసీ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనాథలను వివిధ పుణ్యక్షేత్రాలకు పంపించేందుకు తాను సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ సుధా, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- **టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీఈ పాండ్య**

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీఈ పాండ్య తెలిపారు. ఈ మేరకు వసంతనగర్ సెక్షన్ పరిధిలో మంగళవారం బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని ఆయన కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఆదినారాయణ, ఏఈ వాణి, ఎస్ఎల్ఐ రామ్మోహన్, లింగస్వామి పాల్గొన్నారు.

త్వరలో జిమ్ ఏర్పాటు : కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువకుల కోసం త్వరలో బస్తీలోని కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో జిమ్ ఏర్పాటు చేయిస్తానని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ హామీనిచ్చారు. పార్థీబస్తీలో రూ.45లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతోనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పిట్టల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి, స్థానికులు జైపాల్, జయమ్మ, బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్ఎంలుగా పదోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జీహెచ్ఎంలుగా ముగ్గురికి పదోన్నతి

కూకట్‌పల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నజీమోద్దిన్‌లకు గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి వచ్చింది. వారికి సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవవధువు ఆత్మహత్య


రమ్య (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన మూడు నెలలకే నవ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన మూసాపేటలో జరిగింది. మూసాపేటలోని యాదవ బస్తీకి చెందిన తులసమ్మ తన కూతురు రమ్య(18)ను తమ్ముడికిచ్చి మూడు నెలల క్రితం పెళ్లి చేసింది. అప్పటి నుంచి వారిద్దరూ తులసమ్మ వద్దే ఉంటున్నారు. భర్తను పట్టించుకోకపోవడం, ఎక్కువ సమయం సెల్‌ఫోన్ వాడడంపై తల్లి తులసమ్మ.. రమ్యను సోమవారం రాత్రి మందలించింది. కోపంతో గదిలోకి వెళ్లిన ఆమె ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఏసీపీ రవికిరణ్‌రెడ్డి రమ్య ఆత్మహత్యకు గల కారణాలను ఆమె కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. రమ్య తల్లి తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ శ్రీనివాస్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, ఎంపీ రఘునందన్‌రావు

రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

● జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్ రోడ్డు విస్తరణ పనులను ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అమీన్‌పూర్ వద్ద నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రధాన రహదారికి అనుసంధానిస్తే రాకపోకలకు సౌలభ్యంగా ఉంటుందని రఘునందన్‌రావు అన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన కర్ణన్ ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ రహదారి పూర్తయితే అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్, బొల్లారం ప్రజలతో పాటు శేరిలింగంపల్లి వాసులకు ఔటర్ రింగ్ రోడ్డు ప్రయాణం మరింత సులభతరం అవుతుందన్నారు.

చందానగర్‌లో పర్యటించిన రఘునందన్‌రావు

చందానగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చందానగర్ జాతీయ రహదారి నుంచి అమీన్‌పూర్ వెళ్లే శ్రీదేవి థియేటర్ రోడ్డును మంగళవారం ఎంపీ రఘునందన్‌రావు పరిశీలించారు. అంతకుముందు ఆయన బెల్ చౌరస్తా వద్ద పైవంతెనను పరిశీలించారు. బీహెచ్‌ఈఎల్ కూడలిలో ఉన్న నాలా పనులను త్వరగా పూర్తి చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బీహెచ్‌ఈఎల్ కూడలి నుంచి శ్రీదేవి థియేటర్ సమీపం వరకు నాలాను విస్తరించేలా చర్యలు తీసుకుంటే వరద సమస్య పరిష్కారమవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఎల్లమ్మబండలో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

డ్రైనేజీ సమస్యలకు త్వరలో పరిష్కారం

హైదర్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్ కాలనీల్లో డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను కోరారు. స్పందించిన ఆయన మంగళవారం కాలనీల్లో పర్యటించి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చెత్తను ఆటో కార్మికులకు మాత్రమే ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో రవి, సీహెచ్ భాస్కర్, గుడ్ల శ్రీనివాస్, మహేష్, బషీర్, సుధాకర్, వెంకట్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారులుగా ఎదగాలి

గచ్చిబౌలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి మహిళలు చిరు వ్యాపారులుగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని శేరిలింగంపల్లి ఉపకమిషనర్ ప్రశాంతి పేర్కొన్నారు. జోనల్ కార్యాలయంలో సర్కిల్ ప్రాజెక్టు అధికారి నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం పొదుపు సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకమిషనర్ ప్రశాంతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలో 1100 సంఘాలు ఉన్నాయని, మరో 1100 కొత్త సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు. మహిళలు బృందంగా ఏర్పడి ప్రతినెలా రూ.200 పొదుపు చేస్తే బ్యాంక్‌ల నుంచి రుణాలు ఇప్పిస్తామన్నారు. సర్కిల్ పరిధిలో అనేక మంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కుట్లు, అల్లికలు, డ్రైక్లీనింగ్ షాపులు, కూరగాయల దుకాణాలు, టైలరింగ్ వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారని ఆమె వెల్లడించారు. పేద, మధ్యతరగతి మహిళలు ముందుకొస్తే సహకారం అందించి గ్రూపులు ఏర్పాటు చేస్తామన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనే మహిళలను నగరంలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేస్తామని, విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు.



పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడుతున్న డీసీ ప్రశాంతి



వృద్ధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

వృద్ధుల సమస్యలను పరిష్కరిస్తాం

గచ్చిబౌలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్‌లో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. మంగళవారం పాపిరెడ్డికాలనీ, గోపినగర్‌కు చెందిన పలువురు వృద్ధులు కార్పొరేటర్‌ను కలిసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు రానివారు దరఖాస్తు చేసుకుంటే వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కిషోర్‌కుమార్

'ఓజోన్' సకల జీవరాశులను కాపాడుతుంది

గచ్చిబౌలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హెచ్‌సీయూ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్సెస్, ఓషియన్ ప్రొఫెసర్ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యుడి నుంచి వెలువడే కిరణాల నుంచి ఓజోన్ పొర భూమిపై ఉండే సకల జీవరాసుల ప్రాణాలను కాపాడుతుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వేలాడుతున్న తీగల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బేల్‌కాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పార్మర్ల వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఆయా ప్రదేశాల్లో పర్యటించి ట్రాన్స్‌పార్మల వద్ద వేలాడుతున్న తీగలను తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



వేలాడుతున్న తీగలను తొలగించిన దృశ్యం

గుండెపోటుతో కండక్టర్ మృతి

మియాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కండక్టర్ మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ డిపో-2లో పని చేసే కండక్టర్ పండరి తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఖైరతాబాద్‌లో ఉంటున్నాడు. పటాన్‌చెరువు నుంచి కోఠి వెళ్లే మెట్రో డీలక్స్ బస్సులో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పండరి మంగళవారం ఉదయం 6.30 గంటలకు డిపోలో వాష్ రూమ్‌కు వెళ్లి అక్కడే కుప్పకూలిపోయాడు. కొంత సమయం తర్వాత తోటి ఉద్యోగులు గమనించి 108కు కాల్ చేయగా.. అక్కడకు చేరుకున్న సిబ్బంది పరిశీలించి అప్పటికే పండరి మృతిచెందినట్లు చెప్పారు. కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పండరి(ఫైల్)



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణయాదవ్

'విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి'

చందానగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ సేవా పక్షం కార్యశాల కన్వీనర్ రాధాకృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. హఫీజ్‌పేట్ డివిజన్ హుడాకాలనీలో డివిజన్ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాధాకృష్ణయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా పక్షం డివిజన్ స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయడం వల్లే తెలంగాణ ప్రాంతం దేశంలో విలీనమైందన్నారు.

విశ్వకర్మ ఆలయంలో నేడు యజ్ఞమహోత్సవం

భెల్‌కాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి సందర్భంగా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని విరాట్ విశ్వకర్మ ఆలయంలో మంగళవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నిత్యపూజలతో పాటు విశ్వకర్మ, కంచికామాక్షి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, అష్టోత్తర అర్చన, మంత్రపుష్పం, గణపతి పూజ, పుణ్యావచనం, అంకురార్పణ, పంచబ్రహ్మ మంటపారాధన, విశ్వకర్మ యజ్ఞమహోత్సవం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. కాలనీలోని ప్రధాన రహదారులపై స్వామివారి ఊరేగింపు ఉంటుంది.

నిత్యం ఇలా వేలాడుతూ వెళ్లాల్సిందే!

● ప్రమాదమని తెలిసీ తప్పని ఫుట్‌బోర్డు ప్రయాణం


సుచిత్ర నుంచి మేడ్చల్ వెళ్తున్న బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు ఆర్టీసీ బస్సులు లేకపోవడం.. ఉన్న బస్సులు కూడా సమయానికి రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రమాదమని తెలిసి కూడా సమయానికి కళాశాలకు, పాఠశాలకు వెళ్లేందుకు వచ్చిన ఒక్క బస్సులోనే ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుచిత్ర నుంచి కొంపల్లి, మేడ్చల్, మైసమ్మగూడకు వెళ్లే బస్సుల్లో విద్యార్థులు ఇలా ఫీట్లు చేస్తూ ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీకి తగ్గట్టు బస్సులు నడపడంతో పాటు బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఇతర ప్రయాణికులు కోరుతున్నారు

దుర్వాసనతో ఉక్కిరి బిక్కిరి!

● రోడ్లపై పారుతున్న మురుగు నీరు
● పేరుకుపోయిన డ్రైనేజీ మట్టి
● కంపుతో స్థానికుల అవస్థలు


పద్మానగర్‌లో రోడ్డుపై పేరుకుపోయిన మురుగు

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని పద్మానగర్ ఫేజ్-2, బాపూనగర్, సంజీవయ్యనగర్, వాజ్‌పేయినగర్ తదితర ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ల నుంచి మురుగు నీరు లీకై రోడ్లపై పారుతోంది. వాన నీటితో పాటు డ్రైనేజీ నీటితో కలిసి వచ్చిన మట్టి వరద కాలువల్లోకి వెళ్లకుండా రోడ్లపైనే నిలిచిపోవడంతో ముక్కుపుటాలదిరేలా దుర్వాసన వస్తోంది. ఇళ్లలోకి మురుగు కంపు వస్తుండటంతో తాము సరిగా భోజనం కూడా చే యలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. పరిసరాలను పరి శుభ్రం చేయించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే తాము మురుగు సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పారుతున్న మురుగునీటిని, మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో డ్రైనేజీ పైప్‌లైన్లలో నుంచి వ్యర్థాలను ముందస్తుగా తొలగిస్తే సమస్య పునరావృతం కాకుండా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై సీపీఐ ఫిర్యాదు

నిజాంపేట, (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి మండల పరిధిలోని సర్వే నెంబరు 233/15లో ప్రభుత్వ స్థలం కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన రెండు విల్లాలను తొలగించాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, బాచుపల్లి మండ లంలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-3 సమీపంలో సర్వే నం. 233/15లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి సర్వే నం. 274లోని పత్రాలతో అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రైవేట్ స్థలాల పత్రాలను చూపించి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం సర్వసాధారణంగా మారిందన్నారు.





సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య


సుమన్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాను పని చేస్తున్న పరిశ్రమలోనే ఓ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, చింతకుంట మండలానికి చెందిన సుమన్(58) జీవనోపాధి కోసం 16 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి సూరారంలో నివాసముంటున్నాడు. ఇతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దేవరయాంజాల్ సమీపంలోని స్విచ్‌గేర్ అండ్ స్ట్రక్చరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నా డు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి విధులకు వెళ్లిన సుమన్ మంగళవారం ఉదయం ప రిశ్రమ ఆవరణలో ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పరిశ్రమలోని కార్మికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే అతను చనిపోయాడనినిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు


బాపూనగర్‌లో వర్షాలకు ధ్వంసమైన రోడ్డు

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ బాపూనగర్ 5వ నంబర్ రోడ్డు నుంచి పద్మానగర్ ఫేజ్-2కు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల కారణంగా నడుం నొప్పి వస్తోందని, ద్విచక్ర వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రాత్రిపూట గుంతలను గమనించక కొందరు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

●ఒకరి నుంచి 10 బైకులు ●మరొకరి నుంచి వెండి సామగ్రి స్వాధీనం


బైకుల దొంగను,స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపిస్తున్న పోలీసులు

గాజులరామారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోరీ ఘటనల్లో ఇద్దరు దొంగలను సూరారం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, సీఐ సుధీర్‌కృష్ణ, డీఐ సతీష్‌తో కలిసి మంగళవారం సూరారం పోలీసు స్టేషన్‌లో విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్ ఎన్‌జీఓ కాలనీకి చెందిన మహ్మద్ సాదక్ అలీ అలియాస్ బాబా (35) ప్లంబర్. రోజూ ఇతను నర్సాపూర్ నుంచి నగరానికి వచ్చి పని చేసుకొని తిరిగి వెళ్లేవాడు. ఈ క్రమంలో సూరారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో నిలిపిన ద్విచక్ర వాహనాలను రోజుకు ఒకటి చొప్పున దొంగిలించాడు. ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి సెప్టెంబరు 16వ తేదీ మధ్య సూరారం పీస్ పరిధిలో 9 , జీడిమెట్ల డివిజన్‌లో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశాడు. ఇలా ఉండగా, దొంగిలించిన వాహనాలను నగరంలో విక్రయించే ఉద్దేశంతో మంగళవారం బైక్ (టీఎస్ 15ఈఎస్ 5153)పై బయలుదేరాడు. సూరారం చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసిన సాదక్ అలీ తన బైక్‌ను స్పీడ్‌గా వెనక్కి తిప్పి వెళ్లిపోతుండగా, పోలీసులకు అనుమానం వచ్చి అతడిని పట్టుకున్నారు. బైక్ పత్రాలను అడగ్గా పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. గతంలో బైక్ యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బైక్‌లు చోరీ చేసింది మహ్మద్ సాదక్ అలీ అలియాస్ బాబాగా గుర్తించారు. విచారణలో తానే బైక్‌లు చోరీ చేశానని అతను ఒప్పుకున్నాడు.

మరో కేసులో..

గాజులరామారం డివిజన్ ఆదర్శనగర్‌లో ఓ ఇంటి తలుపు పగులగొట్టి ఇంట్లో ఉన్న వెండి వస్తువులతో పాటు రూ.30 వేల నగదు చోరీ చేసిన దొంగను సూరారం పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ శంకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గాజురామారం రోడామిస్త్రీనగర్‌కు చెందిన కులదీప్‌సింగ్ (19) దొంగిలించిన వెండి వస్తువులను జేబులో పెట్టుకొని దేవేందర్‌నగర్ రాధాకృష్ణ ఆలయం వద్ద నుంచి కైసర్‌నగర్ వైపు నడుచుకుంటూ వెళ్తూ అక్కడ ఉన్న పోలీసులను చూపి వెనక్కి పరుగెట్టాడు. పోలీసులకు అనుమానం వచ్చి కులదీప్‌సింగ్‌ను పట్టుకొని తనిఖీ చేయగా, జేబులో వెండి వస్తువులు లభించాయి. అతడిని విచారించగా ఆదర్శనగర్‌లోని ఓ ఇంట్లో వెండి వస్తువులతో పాటు రూ. 30 వేల నగదు చోరీ చేశానని అంగీకరించాడు. నిందితుడి నుంచి ఒక కుంకుమ భరిణి, 3 వెండి గిన్నెలను స్వాధీనం చేసుకోగా, రూ. 30 వేలును తన వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేశానని నిందితుడు పోలీసులకు చెప్పాడు. కాగా, నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ తెలిపారు.





